క్లుప్తంగా

కార్గో కమర్షియల్ ఆఫీసర్ బదిలీ

తిరుపతి అర్బన్: ఆర్టీసీ కార్గో కమర్షియల్ జిల్లా అధికారి సుబ్బారావు పశ్చిమగోదావరి జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ప్రకాశం జిల్లా ఆర్టీసీ అకౌంట్స్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న ఆర్.సురేంద్రబాబు నియమితలయ్యారు. కొత్త అధికారి రెండు రోజుల్లో బాధ్యతలు స్వీకరించనున్నారు.

నీలం సంజీవరెడ్డికి నివాళి



తిరుపతి ఎడ్యుకేషన్ : భారత మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి వర్ధంతిని గురువారం ఎస్వీ యూనివర్సిటీలో ఘనంగా నిర్వహించారు. వర్సిటీ ఆవరణలోని నీలం సంజీవరెడ్డి విగ్రహానికి వీసీ కె.రాజారెడ్డి, రిజిస్ట్రార్ మహమ్మద్ హుస్సేన్ గజమాల వేసి ఘన నివాళులర్పించారు. వర్సిటీ ఏర్పాటుకు ముఖ్యభూమికను పోషించిన నీలం సంజీవరెడ్డి సేవలు చిరస్మరణీయమని గుర్తు చేసుకున్నారు.

పేదలకు అన్నదానం



తిరుపతి కల్చరల్: రణధీర్‌పురం పంచాయతీ ఉప సర్పంచ్ మల్లెమొగ్గల ఉమాపతి జన్మదినాన్ని పురస్కరించుకొని మల్లెమొగ్గల యువసేన ఆధ్వర్యంలో గురువారం రుయా ఆసుపత్రి వద్ద 500 మంది పేదలకు అన్నదానం చేశారు. మార్కెట్ యార్డ్ డైరెక్టర్ హరిక్రిష్ణ, ఉప సర్పంచ్ మల్లెమొగ్గల ఉమాపతి, యువసేన ప్రతినిధులు శివ, ప్రవీణ్, భరత్, ఫణి, జాకీర్, హరి, మహేష్ పాల్గొన్నారు.

నగర సుందరీకరణ పోటీలకు సిద్ధంకండి

తిరుపతి తుడా: స్వచ్ఛ భారత్ మిషన్ కింద నగర సుందరీకరణ పోటీలకు సర్వం సిద్ధం చేయాలని కమిషనర్ హరిత అధికారులను ఆదేశించారు. ఆమె గురువారం అధికారులతో సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ గ్రీన్ స్పేస్, వాటర్ ఫ్రంట్ ఒక కేటగిరీగా ఉండగా, మరో కేటగిరీలో హెరిటేజ్, టూరిజం ఉన్నట్టు పేర్కొన్నారు. అన్ని కేటగిరీల్లో పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, ఎస్ఈ మోహన్, ఎంఈలు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హరికృష్ణ, రెవెన్యూ అధికారి సేతుమాధవ్, డీఈలు విజయకుమార్ రెడ్డి, రవీంద్రారెడ్డి, దేవిక, గోమతి, మహేష్, నరేంద్ర పాల్గొన్నారు.

మూర్ఛ రోగులకు మెరుగైన సదుపాయాలు

తిరుపతి తుడా: సిమ్స్‌కు వచ్చే మూర్ఛ రోగులకు మెరుగైన సదుపాయాలు కల్పిస్తున్నట్టు స్విమ్స్ డైరెక్టర్ వెంగమ్మ తెలిపారు. స్విమ్స్ న్యూరాలజీ, ఇండియన్ ఎపిలెప్సీ అసోసియేషన్ తిరుపతి విభాగాలు సంయుక్తంగా గురువారం ఎపిలెప్సీ కేర్ మోడల్ ఫర్ రూరల్ ఇండియా అనే అంశంపై ఎనిమిదవ వార్షిక వరియేషన్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ వెంగమ్మ మాట్లాడుతూ ప్రతి నెలా స్విమ్స్‌లో నిర్వహించే ఉచిత మూర్ఛ వైద్య శిబిరాలకు హాజరయ్యే వారికి నెలకు సరిపడా మందులు ఉచితంగా అందజేస్తున్నట్టు చెప్పారు. డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీహరి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలోనే మూర్ఛ రోగులను గుర్తించి సకాలంలో వైద్య సేవలు అందిస్తున్నట్టు తెలిపారు. అనంతరం డాక్టర్ నిర్మల్ సూర్య ఎపిలెప్సీ కేర్ మోడల్ ఫర్ రూరల్ అనే అంశంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.

టపాసుల గోడౌన్లలో తనిఖీలు

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి మండలం రామిరెడ్డిపల్లిలో టపాకాయల గోడౌన్లలో గురువారం చంద్రగిరి తహసీల్దార్ శిరీష, సీఐ ఓబులేశు, అగ్నిమాపక అధికారి కిరణ్‌కుమార్ రెడ్డి తనిఖీ చేశారు. రెండు రోజుల క్రితం జిల్లాలో టపాసుల గోడౌన్‌లో ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం చోటుచేసుకోవడంతో పలువురు మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో అధికారులు తనిఖీ చేపట్టి లైసెన్స్‌లను పరిశీలించారు. రామిరెడ్డిపల్లిలో ఉన్న గోడౌన్ అనుమతుల గడువు ముగిసినట్లు గుర్తించారు. లైసెన్స్‌ను పునరుద్ధించకుండా సరుకును నిల్వ చేసినా, తయారు చేసినా కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ శిరీష హెచ్చరించారు.

అమృత్ సరోవర్ పనుల పరిశీలన

రామచంద్రాపురం: మండలంలోని పుల్లమనాయుడు కండ్రిగ, రాయలచెరువు, సీరామాపురం ఎస్టీకాలనీల్లో ఉపాధి కింద చేపట్టిన అమృత్ సరోవర్ పాండ్ నిర్మాణ పనులను గురువారం ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ వెంకటరమణ, హార్టికల్చర్ ఏడీ రమేష్‌రెడ్డి, సోషల్ ఆడిట్ డీఆర్పీ రవి, ఎంపీడీఓ మహ్మద్ రఫీ పరిశీలించారు. వారు మాట్లాడుతూ పదివేల క్యూబిక్ మీటర్ల నీరు నిల్వ ఉండేలా అమృత్ సరోవర్ పనులు చేపట్టినట్టు తెలిపారు. ఇందులో 50 కుటుంబాలు లబ్ధి పొందాయని చెప్పారు.

సాయి సుధాలో రెటీనా పరీక్షలు

తిరుపతి తుడా: శ్రీ సాయి సుధా కంటి ఆసుపత్రిలో గురువారం సుధారాణి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత రెటీనా వైద్య శిబిరం నిర్వహించారు. ఆసుపత్రి అధినేత్రి డాక్టర్ రాళ్లపల్లి సుధారాణి 50 మందికి పైగా రెటీనా పరీక్షలను నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

నూతన సబ్ డివిజన్లు ప్రారంభం

- పరిపాలన సౌలభ్యం.. ప్రజలకు సత్వర సేవలు
- తిరుపతి సబ్ డివిజన్‌గా ఈస్ట్ సబ్ డివిజన్ మార్పు
- చంద్రగిరి సబ్ డివిజన్‌గా వెస్ట్ సబ్ డివిజన్
- తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్‌గా మారిన ఎంఆర్ పల్లి



ఈస్ట్ పోలీస్ స్టేషన్

తిరుపతి క్రైమ్: తిరుపతి నగర ప్రజలకు సత్వరం పోలీసు సేవలు అందించడంతోపాటు పరిపాలన సౌలభ్యం, శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ ద్వారా సబ్ డివిజన్లను ఏర్పాటుచేసింది. కొన్నింటి పేర్లు మార్చారు. కొన్ని ప్రాంతాలను వివిధ పోలీసు స్టేషన్ల పరిధిలోకి తీసుకువచ్చారు. ఈ క్రమంలో మారిన సబ్ డివిజన్ల పరిధిలో గురువారం నుంచి సేవలు ప్రారంభమయ్యాయి.

చంద్రగిరి సబ్ డివిజన్‌గా వెస్ట్ సబ్ డివిజన్ మార్పు

కొత్తగా ఏర్పడిన చంద్రగిరి సబ్ డివిజన్‌లోకి ఏడు పోలీస్ స్టేషన్‌లు వచ్చాయి. వీటిలో తిరుపతి రూరల్, (గతంలో ముత్యాలరెడ్డి పల్లి), తిరుచానూరు, చంద్రగిరి, రామచంద్రాపురం, పాకాల, ఎర్రావారిపాలెం, భాకరాపేట ఉన్నాయి. గతంలో తిరుపతి ఈస్ట్ సబ్ డివిజన్‌లో ఉన్న తిరుచానూరు పోలీస్ స్టేషన్‌ను చంద్రగిరి సబ్ డివిజన్‌లోకి చేర్చారు. ముత్యాలరెడ్డి పల్లి పోలీస్ స్టేషన్(ఎంఆర్‌పల్లి)ను తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్‌గా మార్పు చేశారు.

తిరుపతి సబ్ డివిజన్‌గా ఈస్ట్ సబ్ డివిజన్

కొత్తగా ఏర్పడిన తిరుపతి సబ్ డివిజన్‌లోకి తిరుపతి ఈస్ట్, అలిపిరి, వెస్ట్, ఎస్వీయూ పోలీస్ స్టేషన్లను చేర్చారు. గతంలో తిరుపతి వెస్ట్ సబ్ డివిజన్‌లో ఉన్న తిరుపతి వెస్ట్, ఎస్వీయూ పోలీస్ స్టేషన్లను ప్రస్తుతం కొత్తగా ఏర్పడిన తిరుపతి సబ్ డివిజన్ లోనికి చేర్చారు.

అలిపిరి పోలీస్ స్టేషన్ పరిధిలో...

తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న కోరమేనుగుంట ప్రాంతం పూర్తిగా అలిపిరి పోలీస్ స్టేషన్ పరిధిలోకి వచ్చింది. అదేవిధంగా అలిపిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆర్.కె.డీలక్స్ జంక్షన్ నుంచి గరుడ సర్కిల్ వరకు, స్విమ్స్ హాస్పిటల్, రుయా ఆసుపత్రి, బర్డ్ ఆసుపత్రి, ఆయుర్వేదిక్ కాలేజీ, స్టాఫ్ క్వార్టర్స్, గరుడ సర్కిల్ నుంచి జూపార్క్ రోడ్, వేదిక్ యూనివర్సిటీ , సైన్స్ సెంటర్, అరవింద్ ఐ ఆసుపత్రి, టాటా కాన్సర్ హాస్పిటల్, భారతీయ విద్యా భవన్ ప్రాంతాలను వెస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలోకి మార్పు చేశారు.

ఎస్వీయూ పోలీస్ స్టేషన్ పరిధిలో ..

ఎంఆర్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ 19, 20, 22 డివిజన్లలోని అన్నమయ్య సర్కిల్ నుంచి అవిలాల జంక్షన్ వరకు ఉన్న రోడ్డుకు పడమర ఉన్న ప్రాంతాలు, అవిలాల జంక్షన్ నుంచి వైకుంఠపురం, తెలుగు తల్లి విగ్రహం, చాముండేశ్వరి గుడి వరకు ఉత్తరం వైపు గల ప్రాంతాలు, ఎల్ఎస్ నగర్‌ను ఎస్వీ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలోకి తీసుకువచ్చారు.

తిరుచానూరు పోలీస్ స్టేషన్ పరిధిలో...

తిరుచానూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న 9 గ్రామ పంచాయతీలు తిరుచానూరు, పద్మావతి పురం, వేదాంతపురం, కేసీపేట, తనపల్లి, పాడిపేట, ముండ్లపూడి, బ్రాహ్మణపట్టు, కుంట్రపాకం యధావిధిగా కొనసాగుతాయి. అలిపిరి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న 5 గ్రామ పంచాయతీలు మంగళం క్వార్టర్స్, రణధీర్ పురం, సప్తగిరి నగర్, బీ.టీ.ఆర్. పురం, శెట్టిపల్లి పంచాయతీలో గల ప్రాంతాలైన మంగళం, మిట్ట గాంధీ పురం, చెన్నాయగుంట గ్రామాలను తిరుచానూరు పోలీస్ స్టేషన్ పరిధిలో కలిపారు.

తిరుపతి సబ్ డివిజన్‌లో..

ఎంఆర్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ 14, 15 డివిజన్‌లోని అన్నమయ్య సర్కిల్ నుంచి ఈఎస్ఐ హాస్పిటల్ జంక్షన్ వరకు తూర్పు భాగంలో ఉన్న బైరాగిపట్టెడ, ఇతర ప్రాంతాలు ఈఎస్ఐ హాస్పిటల్ జంక్షన్ నుంచి ఎస్‌జీఎస్ ఆర్ట్స్‌కాలేజీ జంక్షన్ వరకు ఉన్న రోడ్డుకు ఉత్తరం వైపు ఉన్న ప్రాంతాలు, తిరుచానూరు పరిధిలో ఉన్న తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ 14వ డివిజన్‌లోని శ్రీనివాస కల్యాణ మండపం నుంచి వివేకానంద విగ్రహం రాఘవేంద్ర నగర్ 5 క్రాస్ నుంచి కేశవాయనగుంట మెయిన్ రోడ్డు మధ్యలో ఉన్న భాగాలను తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలోకి కలిపారు.

మారిన ఎంఆర్ పల్లి పోలీస్ స్టేషన్ పేరు

ఎంఆర్‌పల్లి పోలీస్ స్టేషన్‌ను తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్‌గా మార్చారు. దీని పరిధిలో గతంలో ఉన్న 15 గ్రామ పంచాయతీల్లో గాంధీపురం, చిగురువాడ, దుర్గసముద్రం, మల్లంగుంట, రామానుజపల్లి, సి.గొల్లపల్లి, పైడిపల్లి, పాతకాల్వ, పెరుమాళ్లపల్లి, సి.మల్లవరం, చెర్లోపల్లి, వెంకటపతి నగర్, పుదిపట్ల, పేరూరు, తుమ్మలగుంట యధావిధిగా కొనసాగుతాయి. అదేవిధంగా తిరుచానూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న అవిలాల, లింగేశ్వర్ నగర్, సాయి నగర్, ఓటేరు, శ్రీనివాసపురం గ్రామ పంచాయతీలను కలిపారు. ఈఎస్ఐ హాస్పిటల్ జంక్షన్ నుంచి శ్రీనివాస కల్యాణ మండపం వరకు, శ్రీనివాస కల్యాణ మండపం నుంచి సింధు ఫ్లై వోవర్ జంక్షన్ వరకు, సింధు ఫ్లై వోవర్ జంక్షన్ నుంచి ఆర్.సీ.పురం జంక్షన్ వరకు, ఆర్.సీ.పురం జంక్షన్ నుంచి ఈఎస్ఐ హాస్పిటల్ జంక్షన్ వరకు ఉన్న ఈ నాలుగు ప్రధాన మార్గాల మధ్య ఉన్న ప్రాంతాలు తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోకి కలిపారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తాం



సబ్ డివిజన్లలో మార్పులు చేయడం ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు అవకాశం కలిగింది. కొన్ని ప్రాంతాలకు పోలీస్ స్టేషన్‌లు దూరంగా ఉండేవి. ఇప్పుడు ఆ ప్రాంతాలన్నీ దగ్గర ఉన్న పోలీస్ స్టేషన్ల పరిధిలోకి చేరాయి. ప్రజలు ధైర్యంగా సమస్యలు తెలపవచ్చు. డయల్ 100 కి ఫిర్యాదు చేస్తే సకాలంలో సమస్యలు పరిష్కరిస్తాం.

– ఏ.సురేందర్ రెడ్డి, తిరుపతి సబ్ డివిజన్ డీఎస్పీ

పాల ఉత్పత్తులతో జీవనోపాధి మెరుగు



తిరుచానూరులోని నవజీవన్ అంధుల పాఠశాల విద్యార్థులతో ఎస్వీ డెయిరీ టెక్నాలజీ ప్రతినిధులు

తిరుపతి ఎడ్యుకేషన్ : పాల ఉత్పత్తులతో జీవనోపాధి మెరుగుపడుతుందని శ్రీజా సంస్థ డీజీఎం సురేష్ తిమ్మప్ప తెలిపారు. ఇండియన్ డెయిరీ అసోసియేషన్ ఏపీ చాప్టర్, ఎస్వీ డెయిరీ టెక్నాలజీ కళాశాల సంయుక్తంగా గురువారం ప్రపంచ పాల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సాధికారతలో పాడిపరిశ్రమ పాత్ర - శ్రీజ ప్రయాణం అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పాల ఉత్పత్తుల ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థతోపాటు మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నట్టు తెలిపారు. అనంతరం తిరుచానూరులోని నవజీవన్ అంధుల పాఠశాల, రేణిగుంటలోని అభయ క్షేత్రం, పాస్ మనో వికాస్ కేంద్రంతో పాటు వివిధ అనాథాశ్రమాల్లోని వికలాంగులకు పాలు, పాల పదార్థాలు పంపిణీ చేశారు. ఇండియన్ డెయిరీ అసోసియేషన్ ఏపీ చాప్టర్, ఎస్వీ డెయిరీ టెక్నాలజీ కళాశాల చైర్మన్ ఎస్.రవికుమార్, సెక్రటరీ కే.నాగేశ్వరరావు, సభ్యురాలు గురుప్రియ, డెయిరీ టెక్నాలజీ కళాశాల అసోసియేట్ డీన్ వై.రవీంద్రారెడ్డి, విద్యార్థి కార్యకలాపాల ఇన్‌చార్జ్ అధికారి రాజశేఖర్ పాల్గొన్నారు.

సూర్య, చంద్రులపై తేజోమూర్తి



సూర్యప్రభ వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిస్తున్న గోవిందరాజస్వామి

తిరుపతి కల్చరల్: గోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం అనంత తేజోమూర్తి అయిన గోవిందరాజస్వామి సూర్య ప్రభ వాహనంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఉదయం సామి నాలుగు మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం ఆలయ ఆవరణలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీగోవిందరాజస్వామి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం ఊంజల్ సేవ వేడుకగా సాగింది. రాత్రి స్వామి వారు చంద్రప్రభ వాహనంపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. పెద్ద జీయంగార్ స్వామి, చిన్నజీయంగార్ స్వామి, కంకణభట్టార్ ఏపీ.శ్రీనివాస దీక్షితులు, డెప్యూటీ ఈవో శాంతి, ఏఈవో రవికుమార్, సూపరింటెండెంట్ మోహన్‌రావు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ధనుంజయులు పాల్గొన్నారు.

త్వరలో రూ.100 కోట్లతో సినిమా

- సినీ నటుడు మంచు మోహన్ బాబు



సినీ నటుడు మంచు మోహన్ బాబు, సినీనటి సంఘవి

తిరుమల: త్వరలో రూ.100 కోట్లతో సినిమా నిర్మిస్తామని ప్రముఖ సినీ నటుడు మంచు మోహన్‌బాబు తెలిపారు. ఆయన గురువారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆయన మాట్లాడుతూ కొత్త సినిమా నిర్మాణ వివరాలను త్వరలో మంచి విష్ణు వెల్లడిస్తారని తెలిపారు. రజనీకాంత్ వ్యవహారంపై తాను మాట్లాడనని చెప్పారు. తిరుమలలో ఈవో ధర్మారెడ్డి భక్తులకు మంచి సౌకర్యాలు కల్పిస్తున్నారని కొనియాడారు. హీరో దగ్గుబాటి అభిరామ్ శ్రీవారిని దర్శంచుకున్నారు. ఆయన మాట్లాడుతూ శుక్రవారం విడుదల కానున్న అహింస చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరిస్తారని భావిస్తున్నట్లు తెలిపారు. నటి సంఘవి స్వామిని దర్శించుకున్నారు. ఆమె మాట్లాడుతూ ఐదేళ్ల తర్వాత అవకాశం వస్తే సినిమాల్లో నటిస్తానన్నారు.

ఆగస్టు 11న చలో ఢిల్లీ

గోవుకు జాతీయ హోదాపై టీటీడీ చేసిన తీర్మానాన్ని తక్షణం అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఆగస్టు 11న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు టీటీడీ మాజీ పాలక మండలి సభ్యులు శివకుమార్ తెలిపారు. ఆయన తిరుమల శ్రీవారి దర్శనం అనంతరం మీడియాతో మాట్లాడారు. ఆగస్టు 11న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద చేపట్టనున్న గోఆగ్రహ నిరాహార దీక్షను విజయవంతం చేయాలన్నారు. అనంతరం చలో ఢిల్లీ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

చోరీ కేసులో నిందితుడికి జైలు

తిరుపతి లీగల్ : తిరుమలలో జరిగిన ఓ చోరీ కేసులో ఉమ్మడి అనంతపురం జిల్లా తనకల్లు రాజీవ్ కాలనీకి చెందిన వి.రమేష్‌కు 2 నెలల జైలు శిక్ష, రూ.100 జరిమానా విధిస్తూ తిరుపతి 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి పల్లపోలు కోటేశ్వరరావు గురువారం తీర్పు చెప్పారు. 2020 ఫిబ్రవరి 19న తమిళనాడుకు చెందిన ఓ భక్తుడు తిరుమల ఏపీఎస్ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉండగా అతని ప్యాంట్ జేబులోని వాలెట్ చోరీకి గురైంది. అందులో రూ.2000 నగదు ఉంది. బాధితుడి ఫిర్యాదు మేరకు తిరుమల టూటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేసి రమేష్‌తో పాటు మరో ఇద్దరిని కోర్టులో హాజరుపరిచారు. కేసు విచారణ దశలో నిందితుడు రమేష్ నేరం అంగీకరించడంతో న్యాయమూర్తి అతనికి శిక్ష విధిస్తూ తీర్పుచెప్పారు. మరో ఇద్దరిపై కేసు విచారణ జరగాల్సి ఉంది.

ఇటుకల ట్రాక్టర్ బోల్తా

పాకాల : ఇటుకల ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడి కూలీలు గాయపడ్డారు. ఈ సంఘటన మండలంలోని పదిపుట్లబైలు వద్ద గురువారం చోటు చేసుకుంది. కల్లూరు నుంచి చిత్తూరు వైపు ఇటుకల లోడుతో వెళుతున్న ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో కూలీలు సింహాద్రి, నారాయణ, హరి గాయపడ్డారు. వారిని దామలచెరువు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న సీఐ రాజశేఖర్ తన సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.

టీటీడీకి అతిథి గృహం అప్పగింత

తిరుమల: తిరుమలలోని సన్నిధానం అతిథి గృహం సమీపంలో హైదరాబాద్‌కు చెందిన ఫోనిక్స్ పవర్ అండ్ ఇన్‌ఫ్రా నిర్మించిన శ్రీ వేంకటేశ్వర అతిథి గృహాన్ని టీటీడీకి అప్పగించారు. ఇందులో 12 గదులు ఉన్నాయి. అతిథి గృహం తాళాలను టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఈవో ఏవీ.ధర్మారెడ్డికి గురువారం దాత సురేష్ చుక్కపల్లి కుటుంబ సభ్యులు రమేష్ చుక్కపల్లి, అవినాష్ చుక్కపల్లి గోపీకృష్ణ అందజేశారు. డెప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఓఎస్‌డీ రామకృష్ణ పాల్గొన్నారు.

ఊపిరితిత్తుల సమస్యతోనే పులి పిల్ల మృతి

తిరుపతి మంగళం : నాలుగున్నర నెలల వయసున్న పెద్దపులి పిల్ల జూలో వైద్యుల పర్యవేక్షణలో ఆరోగ్యంగా ఉండేదని, అకస్మాత్తుగా ఊపిరితిత్తుల సమస్యతో ఊపిరాడకపోవడంతో చనిపోయిందని తిరుపతి ఎస్వీ జంతు ప్రదర్శనశాల క్యూరేటర్ సెల్వం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆత్మకూరు టైగర్ ప్రాజెక్టు అధికారులు నాలుగు పులిపిల్లలను అప్పజెప్పినప్పటి నుంచి ప్రత్యేక రెస్క్యూ హోమ్లో క్వారంటైన్లో ఉంచి కాపాడినట్టు పేర్కొన్నారు. పులి పిల్ల ఊపిరితిత్తులు, కిడ్నీ సమస్య కారణంగానే మృతి చెందినట్లు వైద్యులు పోస్టుమార్టం రిపోర్టులో తెలిపారని వెల్లడించారు.

వార్డు సభ్యురాలు గీత మృతి

పాకాల : గాదంకి పంచాయతీకి చెందిన వైఎస్సార్ సీపీ నేత దామెదర్‌రెడ్డి భార్య, వార్డు సభ్యురాలు గీత(55) బుధవారం ఆకస్మికంగా మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి గురువారం గ్రామానికి చేరుకున్నారు. ఆమె మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంపీటీసీ శ్యామల, హరిప్రసాద్‌రెడ్డి, నంగ కపిలేశ్వర్‌రెడ్డి, రుకేష్‌రెడ్డి, గోపి, నాగభూషణం పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనుల పరిశీలన

తిరుపతి తుడా: తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ స్మార్ట్ సిటీలో భాగంగా చేపట్టిన ప్రాజెక్టు పనులను గురువారం కమిషనర్ హరిత పరిశీలించారు. ప్రాజెక్టులను పూర్తి స్థాయిలో నడిపించాలని అధికారులను ఆదేశించారు. ఆమె వినాయక సాగర్ వద్ద ఇటీవల ప్రారంభించిన మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని తనిఖీ చేశారు. ప్రాజెక్టు పనితీరుపై ఆరా తీశారు. ఆమె మాట్లాడుతూ రూ.కోట్లతో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా బయోగ్యాస్, సీ అండ్ డీ ప్రాజెక్ట్, తడి, పొడి చెత్త కంపోస్టింగ్, ఎరువుల తయారీ, చెత్త ట్రాన్స్‌ఫర్ స్టేషన్లు, మురుగునీటి శుద్ధి కేంద్రాలు సక్రమంగా నడవకపోతే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. చరిత్రకు సాక్ష్యంగా నిలిచిన స్థానిక చెన్నారెడ్డి కాలనీలో శ్రీకృష్ణదేవరాయలు కాలం నాటి కృష్ణమ నాయుడు కుంట పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కమిషనర్ హరిత ఇంజినీర్లను ఆదేశించారు.

సత్యనారాయణ మృతికి సంతాపం

తిరుపతి కల్చరల్: ప్రముఖ డోలు విద్యాంసుడు అన్నవరపు సత్యనారాయణ మృతి కళారంగానికి తీరని లోటని తిరుపతి వాయిద్య కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు రుద్రకోటి సదాశివం తెలిపారు. ఎస్వీ సంగీత, నృత్య కళాశాలలోని ఎస్‌వీ నాదస్వర, డోలు పాఠశాలలో గురువారం అన్నవరపు సత్యనారాయణ సంతాపసభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

జూలై నుంచి అందుబాటులోకి శ్రీనివాస సేతు

- నిర్మాణ పనులు 92 శాతం పూర్తి
- టీటీడీ ఈవో ఏవీ.ధర్మారెడ్డి



అధికారులతో సమీక్షిస్తున్న టీటీడీ ఈవో ఏవీ.ధర్మారెడ్డి

తిరుపతి తుడా: శ్రీనివాస సేతు నిర్మాణ పనులు 92 శాతం పూర్తయ్యాయని, మిగిలిన 8 శాతం పనులు జూన్ 30వ తేదీకి పూర్తి చేసి జూలై నుంచి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని టీటీడీ ఈవో ఏవీ.ధర్మారెడ్డి అధికారులను ఆదేశించారు. ఆయన గురువారం తిరుపతి టీటీడీ పరిపాలనా భవనంలో తిరుపతి స్మార్ట్ సిటీ ఎండీ హరిత, టీటీడీ జేఈవో వీరబ్రహ్మం ఇతర అధికారులతో శ్రీనివాస సేతు నిర్మాణ పనులపై సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ మీడియన్స్, మొక్కల పెంపకం, డ్రైనేజీ, వీధుల ఆధునికీకరణ, అవసరమైన చోట్ల పెయింటింగ్, లైటింగ్ తదితర పనులను ఈ నెల 30వ తేదీలోపు పూర్తి చేయాలన్నారు. రామానుజ సర్కిల్ నుంచి సుబ్బలక్ష్మి సర్కిల్ వరకు పెండింగ్‌లో ఉన్న నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసేందుకు ఇతర ప్రాంతాలలో తయారీలో ఉన్న బేరింగ్‌లు, వాషర్లను తెప్పించాలన్నారు. తిరుచానూరు మార్కెట్ యార్డు నుంచి రామానుజ సర్కిల్ వరకు, శ్రీనివాసం నుంచి కపిలతీర్థం, మంగళం రోడ్డు వరకు పూర్తయిన రోడ్లను మున్సిపల్ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఈవోకు వివరించారు. ఈ సమావేశంలో టీటీడీ సీఈ నాగేశ్వరరావు, మున్సిపల్ కార్పొరేషన్ ఎస్ఈ మోహన్, స్మార్ట్ సిటీ కార్పొరేషన్ జీఎం చంద్రమౌళి, ఎంఈ చంద్రశేఖర్, ఆఫ్కాన్స్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

క్షతగాత్రులకు టీటీడీ చైర్మన్, ఈవో పరామర్శ



బాధితులను పరామర్శిస్తున్న వైవీసుబ్బారెడ్డి, ధర్మారెడ్డి

తిరుపతి తుడా: గోవింద రాజస్వామి ఆలయంలో రావి చెట్టుకూలి గాయపడి బర్డ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని టీటీడీ చైర్మన్ వైవీ.సుబ్బారెడ్డి, ఈవో ధర్మారెడ్డి, బోర్డు సభ్యుడు పోకల అశోక్ కుమార్ గురువారం రాత్రి పరామర్శించారు. తిరుపతికి చెందిన క్షతగాత్రులు చంద్రశేఖర్, బేబి, కుమారి నిహారిక ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్య చికిత్స అందించాలని అధికారులను ఆదేశించారు.

రుయా సూపరింటెండెంట్ ఆకస్మిక తనిఖీ



సెంట్రల్ ల్యాబ్‌లో తనిఖీలు చేస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ రవిప్రభు

తిరుపతి తుడా : తిరుపతి రుయా ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ రవిప్రభు రెండో రోజు గురువారం ఆసుపత్రిలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. అత్యవసర విభాగంలో అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ట్రయేజ్ సెంటర్ పనితీరును అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. సెంట్రల్ ల్యాబ్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. పక్కా ఫలితాన్ని రోగికి సకాలంలో అందజేసేందుకు టెక్నీషియన్ కృషి చేయాలన్నారు. బ్లడ్ బ్యాంకులో రక్తనిధి సామర్థ్యాన్ని పరిశీలించారు. అవసరమైన చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. రోగులు రుయా ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. ఏఆర్ఎంవో డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి, ల్యాబ్ టెక్నీషియన్ సురేంద్రబాబు, చిరంజీవులు పాల్గొన్నారు.

పర్యావరణంపై ప్రజలకు అవగాహన కల్పించాలి



సదస్సులో మాట్లాడుతున్న ప్రొఫెసర్ కేసీ.చౌదరి

తిరుపతి ఎడ్యుకేషన్ : పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఇండియన్ అడల్ట్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ కేసీ.చౌదరి తెలిపారు. తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో గురువారం మహిళా అధ్యయన కేంద్రం, వయోజన విద్య, విస్తరణ విద్యా విభాగాల సంయుక్తంగా పర్యావరణ సమతుల్యం-సవాళ్లు అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యం లోపించడంతో జీవరాశుల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని తెలిపారు. ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యతను విస్తరణ విద్యా విభాగం తీసుకోవాలని కోరారు. ఎస్వీయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ పద్మనాభం మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. వైస్ ప్రిన్సిపాల్ శ్యామ్ మోహన్ డేవిడ్‌రాజు మాట్లాడుతూ విస్తరణ కార్యక్రమాల ద్వారా పర్యావరణ పరిరక్షణకు వయోజన విద్యా విభాగం సమాజంలో చైతన్యం తీసుకొస్తోందని పేర్కొన్నారు. వయోజన విద్యా విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ ఆదినారాయణరెడ్డి, ప్రొఫెసర్లు సుధారాణి, సత్యవతి, శ్రీలతకిషోరి, జగదీశ్వరి, సునీత, ఓబులేశు, మహదేవరెడ్డి, సుబ్రమణ్యం, మంజుల, వరలక్ష్మి పాల్గొన్నారు.

చంద్రగిరిలో నేలకూలిన భారీ చెట్లు



చెట్లు కూలిన సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న మోహిత్‌రెడ్డి, బాధితులకు ఆర్థిక సాయం

- రెండు వాహనాలు ధ్వంసం, పలువురికి స్వల్ప గాయాలు
- బాధితులకు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి రూ.30 వేల ఆర్థిక సాయం

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి మండలంలో గురువారం సాయంత్రం గాలీవాన బీభత్సం సృష్టించింది. చంద్రగిరి పట్టణం పాతపేటలో రెండు భారీ వృక్షాలు నేలకూలాయి. ఆ సమయంలో చెట్ల కింద ఉన్న చిన్న ఆటో, లగేజీ ఆటోతో పాటు ఐస్‌క్రీం వాహనం ధ్వంసమయ్యాయి. పలువురుకి స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి బాధితులకు అండగా నిలిచారు. దెబ్బతిన్న వాహనదారులు ముగ్గురికి ఒక్కొక్కరికి రూ.పదివేలు చొప్పున రూ.30 వేలు సాయం అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డి, చేగు ప్రశాంత్‌గుప్త, బుల్లెట్ చంద్రమౌళిరెడ్డి, కుప్పిరెడ్డి భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో రాష్ట్ర సీఎస్, మంత్రి



ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి, మంత్రి వేణుగోపాల కృష్ణ

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు పద్మావతి అమ్మవారిని గురువారం రాత్రి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి, సమాచార శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ వేర్వేరుగా దర్శించుకున్నారు. వారికి అధికారులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లుచేశారు. అనంతరం ఆలయ ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం అందించగా అధికారులు అమ్మవారి శేష వస్త్రంతో సత్కరించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ ప్రభాకర్ రెడ్డి, ఏవీఎస్ఓ శైలేంద్ర బాబు, ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.